క్లుప్తంగా

రైతు ఉత్పత్తి కేంద్రం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ బాల్‌రెడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఫర్టిలైజర్ దుకాణాల్లో ప్రభుత్వ అనుమతులు ఉన్న ఎరువులు, విత్తనాలనే అమ్మాలని, నకిలీ విత్తనాలు అమ్మితే చర్య తప్పదని మండలం వ్యవసాయాధికారి బాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని ఫైజాబాద్‌లోని రైతు ఉత్పత్తి కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని విత్తనాలు, తదితర స్టాక్ పరిశీలించి, రికార్డులు తనిఖీ చేశామన్నారు. అదేవిధంగా గ్రామంలోని వరి, పత్తి పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో రైతు ఉత్పత్తి కేంద్రం నిర్వాహకుడు యాసిన్, రైతు గోపాల్‌రావు, తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

శివ్వంపేట(నర్సాపూర్): ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని మండల ఆ సంఘం అధ్యక్షురాలు గోపమ్మ, కార్యదర్శి రేణుక అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శివ్వంపేట పీహెచ్‌సీ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 18 ఏళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్న తమకు ప్రభుత్వం నుంచి సరైన వేతనాలు రావడం లేదని వాపోయారు. ప్రభుత్వం అప్పగించిన ప్రతీ పనిని సమగ్రంగా నిర్వహిస్తున్నప్పటికీ గుర్తించడం లేదన్నారు. 18 వేల వేతనం ఇవ్వడంతో పాటు ఇతర సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం వైద్యురాలు సాయిసౌమ్యకు వినతి పత్రం అందజేశారు.

దీక్షకు తరలిన సిబ్బంది.. కార్యాలయానికి తాళం

చేగుంట(తూప్రాన్): మండల వనరుల కేంద్రంలో తాత్కాలిక పద్ధతిలో పనిచేస్తున్న సిబ్బందిని రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని మెదక్ రిలే దీక్షకు మంగళవారం తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆపరేటర్ నరేందర్ మాట్లాడుతూ.. మండల వనరుల కేంద్రంలో పనిచేసే సీఆర్‌పీలు, ఎంఐఎస్‌లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఐఈఆర్‌పీ, పీటీఐ, మెసెంజర్స్ ఉపాధ్యాయులతో సమానంగా పని చేస్తున్నారని తెలిపారు. వీరందరిని విద్యాశాఖలో విలీనం చేసి సమాన పనికి సమాన వేతనం అందించాలని మెదక్ రిలే దీక్షలకు తరలి వెళ్తున్నట్లు తెలిపారు. సిబ్బంది రమేశ్, సాయి, నరేశ్, సంతోష్‌లు రిలే దీక్షలకు వెళ్లగా ఎంఈఓ కార్యాలయానికి తాళం వేశారు.

11వ రోజుకు చేరిన రిలే దీక్షలు

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గంను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని, రెవెన్యూ డివిజన్ సాధన జేఏసీ సభ్యులు చిల్వెర ఐబీ చౌరస్తాలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం 11వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో బీజేపీ యువజన నాయకులు ఆంజనేయులు, గోపాల్, శ్రీకాంత్, వెంకట్, మహేశ్, రాజు, నవీన్, నాగరాజు, దుర్గయ్య, సంగయ్య తదితరులు పాల్గొన్నారు. రెవెన్యూ డివిజన్‌తో పాటు అల్లాదుర్గం ఆరోగ్య కేంద్రాన్ని 100 పడకల ఆస్పత్రిగా చేయాలని, గురుకుల పాఠశాల, సబ్ ట్రెజరీ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు.

టికెట్ కోసం దరఖాస్తు



దరఖాస్తు చేస్తున్న రమేశ్‌గౌడ్ తదితరులు

నర్సాపూర్: నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు బీజేపీ టికెట్ కోసం బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రమేశ్‌గౌడ్ మంగళవారం దరఖాస్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనతో పాటు పార్టీ నియోజకవర్గంలోని పలువురు పార్టీ నాయకులు దయాకర్‌గౌడ్, అంజగౌడ్, హరీశ్ తదితరులు వచ్చారని రమేశ్‌గౌడ్ వివరించారు.

సీఆర్‌పీలకు ఎస్టీయూ రామాయంపేట మద్దతు

రామాయంపేట(మెదక్): విద్యాశాఖ సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని మెదక్ కలెక్టరేట్ దగ్గర రిలే నిరాహార దీక్షలు చేస్తున్న సీఆర్‌పీలకు రామాయంపేట ఎస్టీయూ మద్దతు తెలిపారు. ఈ మేరకు మంగళవారం మెదక్ కలెక్టరేట్‌లో రిలే నిరాహార దీక్షలు చేస్తున్న సీఆర్పీలు ఎమ్మెస్ కోఆర్డినేటర్, ఐఆర్పీ కంప్యూటర్ ఆపరేటర్స్, మెసెంజర్ పీటీఐలుగా 15 ఏళ్లుగా కాంటాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారని తెలిపారు. వెంటనే రెగ్యులరైజ్ చేయాలని రామాయంపేట మండల ఎస్టీయూ తరపున డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండల అధ్యక్షుడు ఐరేని రవీందర్ గౌడ్, కార్యదర్శి సరాఫ్ ఇంద్రసేనా చారి పాల్గొన్నారు.

ఉన్నత విద్యకు ప్రాధాన్యం

నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి



కొడిపల్లి పెద్దచెరువులో గంగమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లికి డిగ్రీ కాలేజీ మంజూరుతో మండలంలో ఉన్నత విద్యకు ప్రాధాన్యం పెరుగుతుందని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం కౌడిపల్లి పెద్దచెరువు అలుగు పారడంతో గంగమ్మతల్లికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు బాగా కురిసి చెరువు కుంటలు నిండటం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజునాయక్, మండలాధ్యక్షుడు రామాగౌడ్, యూత్ అధ్యక్షుడు కృష్ణాగౌడ్, ఉపాధ్యక్షుడు నవీన్‌గుప్తా, శివాంజనేయులు, సొసైటీ చైర్మన్ చిన్నంరెడ్డి, మోతిలాల్‌గౌడ్, పురోహితుడు రాజేశ్వరశర్మ తదితరులు పాల్గొన్నారు.

పుకార్లను నమ్మొద్దు

నర్సాపూర్: తాను కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు వస్తున్న పుకార్లను నమ్మొద్దని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ జెండా ఎగుర వేస్తానని సోషల్ మీడియా వేదికగా తెలియ చేస్తున్నానని అన్నారు. తాను కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ఎవరో దుష్ప్రచారం చేస్తున్నారని వివరిస్తూ దానిని ఖండిస్తున్నానని చెప్పారు. తాను బీఆర్ఎస్‌లోనే ఉంటానని స్పష్టం చేశారు.

యాదాద్రిలో పూజలు

ఎమ్మెల్యే మదన్‌రెడ్డి యాదాద్రి లక్ష్మీనృసింహ స్వామిని దర్శించుకొని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట పలువురు బీఆర్ఎస్ నాయకులు, ఉన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామిని మంగళవారం ఎమ్మెల్యే మదన్‌రెడ్డి దర్శించుకున్నారు. అనంతరం సీతారామచంద్ర స్వామి, సత్యనారాయణస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారి రాఘవేంద్రరావు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి టికెట్ ఇవ్వాలి

మండల బీఆర్ఎస్ నాయకుల డిమాండ్



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

కౌడిపల్లి(నర్సాపూర్): నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి మరోసారి టికెట్ ఇవ్వాలని మండల బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కౌడిపల్లిలో మండలాధ్యక్షుడు రామాగౌడ్, యూత్ అధ్యక్షుడు కృష్ణాగౌడ్, ఎంపీపీ రాజునాయక్, ఉపాధ్యక్షుడు నవీన్‌గుప్తా, మాజీ ఎంపీపీ సతీశ్, జిల్లా రైతుబంధు సభ్యుడు శివాంజనేయులు, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ చిన్నంరెడ్డి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు శేఖులు, నరహరి, లక్ష్యనాయక్, నాయకులు మహిపాల్‌రెడ్డి, కాంతారావ్, నాయికోటి రాజు, సాయిరెడ్డి, గోపాల్‌రెడ్డి, వీరయ్య, కుతుబొద్దీన్, దుర్గయ్య, రాజు, సర్దార్, సత్తయ్య, రవి, గౌరిరెడ్డి, మోతిలాల్‌గౌడ్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

మండలానికి చేరుకున్న బతుకమ్మ చీరలు



ఎంపీడీఓ కార్యాలయంలో బతుకమ్మ చీరలు

శివ్వంపేట(నర్సాపూర్): బతుకమ్మ పండగ సందర్భంగా మహిళలకు అందజేసేందుకు బతుకమ్మ చీరలు మంగళవారం ఎంపీడీఓ కార్యాలయానికి చేరాయని ఎంపీడీఓ నవీన్ కుమార్ చెప్పారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మెదక్ మున్సిపాలిటీకి రూ. 50 కోట్లు మంజూరు

మెదక్ మున్సిపాలిటీ: మున్సిపాలిటీ అభివృద్ధికి సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా రూ. 50 కోట్లు మంజూరు చేయడంపై మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మంత్రి హరీశ్‌రావు, మంత్రి కేటీఆర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

పంట రుణాలు ఇప్పించండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

మెదక్ కలెక్టరేట్: పీఏసీఎస్‌ల ద్వారా పంట రుణాలు ఇప్పించాలని కోరుతూ మండలంలోని మంభోజిపల్లి పీఏసీఎస్ పరిధిలోని పరపతి సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, రైతులు మంగళవారం కలెక్టర్ రాజర్షీషాను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఘనంగా గురుపూజోత్సవం

జిల్లా వ్యాప్తంగా మంగళవారం గురుపూజోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఆయా పాఠశాలల్లో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లి ఎస్టీ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం



కౌడిపల్లి గిరిజన బాలికల మినీగురుకులంలో..



నర్సాపూర్‌లోని వైపర్ కాలేజీలో ..



చేగుంటలో సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు



హవేళీఘనపూర్(మెదక్): ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఉమెన్స్‌రైట్స్ సభ్యులు



పాపన్నపేట(మెదక్): కళాశాలలో..



టేక్మాల్‌లో ..

పొంగి పొర్లుతున్న చెరువులు

జిల్లా వ్యాప్తంగా భారీగా కురుస్తున్న వర్షాలతో చెరువులు నిండి అలుగులు పారుతున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో పంట పొలాలు నీట మునిగాయి. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి



అల్లీపూర్‌లో నీట మునిగిన వరి పంట



వెల్దుర్తి(తూప్రాన్): అలుగు పారుతున్న దేవతల చెరువు



కొల్చారం(నర్సాపూర్): అలుగు పారుతున్న సంగాయిపేట పెద్ద చెరువు



చిలప్‌చెడ్ శివారులో మత్తడి దూకుతున్న వరదనీరు



రేగోడ్(మెదక్): పొంగిపొర్లుతున్న జగిర్యాల చెరువు



చిట్కుల్‌లో వరి పంటలో చేరిన వరద నీరు



నర్సాపూర్ రూరల్: రాయరావు చెరువు



అలుగు పారుతున్న అల్లాదుర్గం పటేల్‌చెరువు

రామాయంపేటకు మంచి రోజులు

మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్

రామాయంపేట(మెదక్): రెవెన్యూ డివిజన్, డిగ్రీ కళాశాల మంజూరుతో రామాయంపేటకు మంచి రోజులు వచ్చాయని మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ అభివృద్ధికి సీఎం రూ. 25 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. డివిజన్ కార్యాలయం, డిగ్రీ కళాశాల నిర్వహణకు భవన సదుపాయం కల్పిస్తామని, ఈమేరకు భవనాలను సిద్ధం చేస్తున్నామన్నారు. రామాయంపేట కేంద్రంగా ఏర్పాటవుతున్న డిగ్రీ కళాశాలలో చేరడానికి విద్యార్థులు ముందుకు రావాలని సూచించారు. విద్యాపరంగా రామాయంపేటను ముందుకు తీసుకెళ్లడానికి పట్టణ ప్రజలతో పాటు విద్యార్థులు కృషి చేయాలని చెప్పారు. పార్టీలకు అతీతంగా ప్రతీ ఒక్కరూ కళాశాల అభివృద్ధికి సహకరించాలని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ నాగరాజు, సహకార సంఘం చైర్మన్ బాదె చంద్రం, డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ గణపతి, ఇతర లెక్చరర్లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల పరస్పర ఆరోపణలు

చిన్నశంకరంపేట(మెదక్): మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పట్లోరి రాజు, సర్పంచ్ రాజిరెడ్డి ఒకరిపై ఒకరు పరస్పర ఆరోపణలు చేసుకొని చర్చకు సిద్ధపడ్డారు. మంగళవారం సర్పంచ్ వర్గీయులు గ్రామ పంచాయతీ వద్ద చర్చకు రావాలని డిమాండ్ చేశారు. అంబాజీపేట దుర్గమ్మ ఆలయం వద్ద పట్లోరి రాజు వర్గీయులు పట్టాపాస్ బుక్‌తో చర్చకు వచ్చారు. భూమి వివాదం ఉన్న చోటకు వచ్చి చర్చించాలని కోరారు. అనంతరం భూ వివాదం కోర్టు పరిధిలో ఉందని తేల్చారు.

రేగోడ్ మండలాన్ని సంగారెడ్డి జిల్లాలో కలపాలి



అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

రేగోడ్ (మెదక్): రేగోడ్ మండలాన్ని సంగారెడ్డి జిల్లాలో కలపాలని కోరుతూ అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్‌కు వినతిపత్రం అందజేశామని పీఏసీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ మంగళవారం తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు సుభాశ్, సర్పంచ్ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

టాయిలెట్లలో నీటి కరువు

అవస్థలు పడిన ఉపాధ్యాయులు

మెదక్ కలెక్టరేట్: మెదక్ కలెక్టరేట్‌లోని టాయిలెట్లలో నీళ్లు రాకపోవడంతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మంగళవారం గురుపూజోత్సవానికి జిల్లాలోని అన్ని మండలాల ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కాగా కలెక్టరేట్‌లోని టాయిలెట్లలో నీళ్లు రాకపోవడంతో టాయిలెట్‌కు వెళ్లిన ఉపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారు. టాయిలెట్ల నిర్వహణ తీరు బాగాలేదని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు అసహనం వ్యక్తం చేశారు.

‘అన్యాయం చేసింది బీఆర్ఎస్ నేతలే’

రేగోడ్(మెదక్): రేగోడ్ మండలాన్ని సంగారెడ్డి జిల్లాలో కలపకుండా అన్యాయం చేసింది అధికారపార్టీ నాయకులే అని పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ఎస్.దిగంబర్‌రావు అన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. రేగోడ్ మండలాన్ని అన్యాయంగా మెదక్ జిల్లాలో కలిపి యువత భవిష్యత్‌ను అగమ్య గోచరంగా మార్చిన ఘనత బీఆర్ఎస్ పార్టీదేనని చెప్పారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, రేగోడ్‌ను సంగారెడ్డి జిల్లాలో కలపాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న చైర్మన్ రవీందర్‌గౌడ్

తూప్రాన్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ రవీందర్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో మున్సిపల్ కమిషనర్‌తో పర్యటించారు. ప్రజల ఇబ్బందులను అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో కమిషనర్ మోహన్, కౌన్సిలర్లు శ్రీశైలంగౌడ్, మల్లేశ్, కృష్ణ, సాయిరాం రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ షేక్‌మహబూబ్ అన్నారు. మంగళవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా భారీగా వర్షం కురవడంతో చెరువులు, కుంటలు నిండి, అలుగులు పారుతున్నాయన్నారు. దాంతో పలు గ్రామాల్లో యువకులు, పిల్లలు చేపలు పట్టేందుకు వెళ్లి, ప్రమాదలకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయ న్నారు. ప్రజలకు అత్యవసర పరిస్థితులు ఎదురైతే 100కు కాల్ చేయ్యాలన్నారు.

కొల్చారం(నర్సాపూర్): మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు తోడు మంజీరా బ్యారేజీ నుంచి దిగువన ఉన్న వనదుర్గ ప్రాజెక్టుకు 12000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండడంతో మంజీరా సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొల్చారం తహసీల్దార్ గఫూర్ ఖాన్, ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ మంగళవారం వేర్వేరుగా ప్రకటనలు చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ **చికిత్స పొందుతూ వ్యక్తి మృతి**

పాపన్నపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మరణించినట్లు పాపన్నపేట ఎస్సై మహిపాల్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కొడుపాకకు చెందిన అరిగె సాయిలు(40) వృత్తిరీత్యా మత్స్యకారుడు. ఆదివారం ఉదయం ఏడుపాయల కమాన్ వద్ద చేపలు అమ్ముకోవడానికి టీవీఎస్ మోపెడ్‌పై వెళ్తుండగా కొడుపాక శివారులో కిందపడి తలకు బలమైన గాయాలు తగిలాయి. అతన్ని మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం సోమవారం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. భార్య మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

◆ **అనారోగ్యంతో మహిళ మృతి**

చేగుంట(తూప్రాన్): అనారోగ్యంతో మహిళ మృతి చెందిన సంఘటన మండల కేంద్రం చేగుంటలో మంగళవారం వెలుగు చూసింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా దుడిగల్ గ్రామానికి చెందిన బిసోల్ల పద్మ (52) భర్త భిక్షపతితో విడిపోయి కూతురు సాయిప్రసన్నతో కలిసి చేగుంటలో నివాసం ఉంటుంది. మూడేళ్ల క్రితం కూతురుకు వివాహం చేయగా, 10 నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. అప్పటినుంచి ఒంటరిగా ఉంటున్న పద్మ ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధితో బాధపడుతుంది. ప్రస్తుత వర్షాలకు శ్వాస తీసుకోవడంలో ఆమె ఇబ్బంది పడి నిద్రలోనే మృతి చెందింది. మృతురాలి తమ్ముడు రాజలింగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఏఎస్‌ఐ రవీందర్ తెలిపారు.

◆ **కూలిన రేకుల ఇల్లు**

శివ్వంపేట(నర్సాపూర్): కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు ఇళ్లు పాక్షికంగా కూలిపోయాయి. అల్లీపూర్‌లో శామమ్మకు చెందిన రేకుల ఇల్లు కూలిపోయింది. గోడ కూలడంతో పైకప్పు రేకులు పడిన సంఘటనలో శామమ్మతో అతని కొడుకు యాదగిరికి స్వల్ప గాయాలయ్యాయి.

◆ **సమితి మాజీ ప్రెసిడెంట్ సంగమేశ్వర్ రెడ్డి మృతి**

పాపన్నపేట(మెదక్): మెదక్ మాజీ సమితి ప్రెసిడెంట్ కే.సంగమేశ్వర్ రెడ్డి (88)మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. మెదక్ సమితి ప్రెసిడెంట్‌గా, యూసుఫ్‌పేట సర్పంచ్‌గా, తర్వాత మెదక్ జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా పనిచేశారు.

◆ **బోర్‌మోటార్, పంపు సామగ్రి చోరీ**

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని గడ్డిపెద్దాపూర్ శివారులో ప్రవీణ్‌కుమార్ అనే వ్యక్తి హైదరాబాద్‌కు చెందిన వీరవెంకట సత్యనారాయణకు చెందిన 6 ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. ఇందులో భాగంగా రెండు నెలల క్రితం హెచ్‌పీ బోర్‌మోటార్, పంప్‌సెట్, 10 టాటా పైపులు, 150 ఫీట్ల కేబుల్‌వైర్‌ను వ్యవసాయ భూమిలోని రూమ్‌లో పెట్టి తాళం వేశాడు. గుర్తు తెలియని వ్యక్తులు గత నెల 29న రూం తాళం పగలగొట్టి అందులోని బోర్‌సామగ్రిని చోరీ చేశారు. ఈ మేరకు ప్రవీణ్‌కుమార్ మంగళవారం అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.